సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 30 । జూన్ । 2023



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి కరీంనగర్ ఎల్‌ఎండీలోకి గురువారం నీటిని విడుదల చేశారు. ఒక్క గేటు ద్వారా 1,065 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



విష్ణు పారాయణం

వేములవాడ: రాజన్న అనుబంధ వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనువంశిక అర్చకులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం

34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మంచు పొగ కమ్ముకునే అవకాశం ఉంది. తేమ శాతం అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

అశ్వవాహనంపై విహారింపు



అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామి వారలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న తొలి ఏకాదశి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై ఊరేగించారు. ఆలయ అధికారులు, అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రూప్‌-4 పరీక్షకు ప్రత్యేక బస్సులు

సిరిసిల్లటౌన్: గ్రూప్‌–4 పరీక్షల కోసం జిల్లా కేంద్రం నుంచి ప్రతి మండల కేంద్రానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా సిరిసిల్ల నుంచి ప్రతి మండల కేంద్రానికి ఉదయం 8–30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. వివరాలకు 73823 12927, 73828 51366, 97048 33971లలో సంప్రదించాలని కోరారు.

ఆసాముల సమ్మె వాయిదా



మాట్లాడుతున్న ఆసాముల సంఘం అధ్యక్షుడు రవీందర్

సిరిసిల్లటౌన్: ఆసాములు తలపెట్టిన నిరవధిక సమ్మెను పక్షం రోజులపాటు వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ తెలిపారు. సిరిసిల్లలో గురువారం నిర్వహించిన ఆసాముల సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ స్పందించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతోనే వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఆసాములకు రావాల్సిన పింజర్ల సబ్సిడీని వెంటనే ఖాతాల్లో జమచేయాలని లేని పక్షంలో నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యదర్శి చేరాల అశోక్, మండల రాజు, పోరండ్ల శ్రీనివాస్, గాజుల శంకర్ ఉన్నారు.

ఆజాద్‌కు రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): ప్రముఖ దళిత నాయకుడు, భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్‌కు రక్షణ కల్పించాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కోనరావుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అగ్రవర్ణాల ఆధిపత్యంలో నలిగిపోతున్న బహుజనుల పక్షాన పోరాడాలని కోరారు. ప్రశ్నించే గొంతుకలను ఎదుర్కొనే దమ్ము లేకనే తూటాలు పేలుస్తున్నారని ఆరోపించారు. భీమ్ ఆర్మీ నాయకులు కాంతయ్య, జాషువా, అరుణ్, విజయ్, శేఖర్, ప్రదీప్, రాజు, మహేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

- చందుర్తిలో అత్యధికంగా 30.5 మిల్లీ మీటర్లు
- కోనరావుపేటలో అత్యల్పంగా 4.3 మిల్లీమీటర్లు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా చందుర్తిలో 30.5 మిల్లీమీటర్ల వర్షం పడగా.. కోనరావుపేటలో అత్యల్పంగా 4.3 మిల్లీమీటర్లు కురిసింది. రుద్రంగిలో 13.3, వేములవాడ రూరల్‌లో 8.6, బోయినపల్లిలో 4.5, వేములవాడలో 12.9, సిరిసిల్లలో 8.5, వీర్నపల్లిలో 16.0, ఎల్లారెడ్డిపేటలో 21.5, గంభీరావుపేటలో 16.3, ముస్తాబాద్‌లో 21.0, తంగళ్లపల్లిలో 12.9, ఇల్లంతకుంటలో 9.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సగటున 13.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదైందని సీపీవో శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 63 శాతం లోటు వర్షాలు నమోదయ్యాయి.

రాజన్నా నీవే దిక్కు



వేములవాడ: రాజన్నకు సెలవుల రద్దీ పెరిగిపోయింది. బక్రీద్ పండుగ, తొలి ఏకాదశి పండుగలు వచ్చినప్పటికీ వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణ భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. రాజన్న సన్నిధిలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి ఆలయ అర్చకులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అనుబంధ ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.



సిరిసిల్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

సిరిసిల్లకల్చరల్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇబ్రహీం త్యాగ నిరతిని స్ఫూర్తిగా తీసుకోవాలని మత్తపెద్దలు సూచించారు. ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖబ్రస్థాన్ వద్ద పూర్వీకులు ఆత్మలు శాంతించేందుకు సమాధులపై పుష్పాలు చల్లి నివాళి అర్పించారు.

ఆగుతూ.. సాగుతూ..!

- పెద్దపల్లి – ఇందూరు రైల్వేకు 30 ఏళ్లు
- 1993లో శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని పీవీ
- 24 ఏళ్లకు పూర్తయిన రైల్వేలైన్
- విద్యుద్దీకరణ పూర్తయినా సింగిల్ మార్గమే
- కొత్తపల్లి మనోహరాబాద్ పూర్తయితే మరిన్ని రైళ్లు
- భవిష్యత్ రైల్వే కేంద్రంగా కరీంనగర్





శంకుస్థాపన శిలాఫలకం(ఫైల్)



పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపల్లిలో శంకుస్థాపన చేస్తున్న అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 1993 జూన్ 30.. ఇదొక చారిత్రక విశిష్టత కలిగిన రోజు. రైలు కూత వినాలన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల కలకు ఆ రోజే బీజం పడింది. కరీంనగర్ ముద్దుబిడ్డ.. నాటి ప్రధాని పీవీ.నరసింహారావు పెద్దపల్లి–నిజామాబాద్ (ఇందూరు) రైల్వేమార్గానికి శంకుస్థాపన చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయ్యాయి. 178 కిలోమీటర్ల దూరమున్న ఈ మార్గానికి పెద్దగా నిధులు కేటాయించకపోవడంతో పనులు నెమ్మదిగా సాగి 24ఏళ్లకు పూర్తయ్యింది. ముందుగా పనులు ప్రారంభించిన ఎనిమిదేళ్లకు కరీంనగర్ వరకు (35 కిలోమీటర్లు) 2001లో లైన్ అందుబాటులోకి వచ్చింది. తరువాత జగిత్యాల వరకు లైన్ కోసం ఆరేళ్లు పట్టింది. 2016 డిసెంబరు 19న జగిత్యాల (లింగంపేట) వరకు రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2015లో లింగంపేట–మోర్తాడ్–నిజామాబాద్ వరకు రైల్వే మార్గాన్ని సిద్ధం చేశారు. తొలుత డీజిల్ ఇంజిన్ల రైళ్ల ప్రయాణం సాగించిన ఈ మార్గం .. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యుదీకరణ చేశారు. 2017లో విద్యుదీకరణ జరిగినా.. నేటికీ సింగిల్ బ్రాడ్‌గేజ్ లైన్‌గానే మిగిలిపోయింది.

పాతవే తప్ప.. కొత్త రైళ్లేవీ..

ఇన్నేళ్ల రైల్వేలైన్ చరిత్రలో ఇక్కడ నుంచి చెప్పుకోదగ్గ రైళ్లేవీ ఇక్కడ నుంచి నడవలేదంటే అతిశయోక్తి కాదు. వీక్లీ స్పెషల్‌గా కాజీపేట నుంచి దాదార్ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్ నుంచి సిర్పూర్ టౌన్ మెము పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ నుంచి కరీంనగర్ డెము ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్, కరీంనగర్ నుంచి తిరుపతి బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గాల నుంచి సరుకు రవాణా ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు అధిక ఆదాయం వస్తోంది. ఈ మార్గంలో ఉమ్మడి జిల్లా నుంచి గ్రానైట్, బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతూనే ఉన్నాయి. గూడ్స్ రైళ్ల రద్దీ పెరగడంతో ఈ మార్గాన్ని రెండు వరుసలుగా విస్తరించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. దీనికి స్థానిక ఎంపీలు చొరవచూపి వచ్చే వర్షాకాల బడ్జెట్ సమావేశాల్లో డబుల్ మార్గంగా అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తులో కరీంనగర్ కీలక జంక్షన్

కరీంనగర్ రైల్వేపరంగా వ్యూహాత్మక ప్రాంతం. కొత్తపల్లి మనోహరాబాద్ హైదరాబాద్ డివిజన్‌లోకి వస్తుంది. అదే పెద్దపల్లి – నిజామాబాద్ రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్. ఈ రెంటినీ కలిపి ఉత్తర భారతానికి వెళ్లే రైళ్లకు కరీంనగర్ కేంద్రంగా మారనుంది. కొత్తపల్లి– మనోహరాబాద్ (151కి.మీ)తోపాటు, ఆర్మూర్– ఆదిలాబాద్ (128 కి.మీ) పూర్తయితే ఉత్తర-దక్షిణ తెలంగాణలకు కరీంనగర్ కేంద్రంగా నిలవనుంది. కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పూర్తయితే మహారాష్ట్ర, గుజరాత్ మరింత దగ్గరవనున్నాయి.

అలా జరగాల్సి ఉండే..!

- మొదటగా పెద్దపల్లి నుంచి నిజామాబాద్ రైల్వేమార్గాన్ని హైదరాబాద్ సంస్థానంలోని చివరి రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1948లో పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మీదుగా నిర్మించాలని అనుకున్నారు. అయితే ఆయన సంస్థానం భారత్‌లో విలీనం కావడంతో ప్రతిపాదన అటకెక్కింది.
- ప్రధానిగా పీవీ బాధ్యతలు చేపట్టాక తాను పెరిగిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి రైల్వేస్టేషన్ లేకపోవడంతో ఈ మార్గాన్ని వయా కరీంనగర్ మీదుగా నిర్మించాలని నిర్ణయించారు. శంకుస్థాపన సమయంలో ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథని నుంచి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు విస్తరించాలని అనుకున్నారు. అయితే భారీగా అటవీ ప్రాంతం ఉండడం.. నక్సలైట్ల ప్రభావం.. గోదావరి నదిపై వంతెనల నిర్మాణం వంటివి అడ్డురావడంతో అనుమతి రాలేదు.

ప్రజల డిమాండ్లివే..

- కాజీపేట నుంచి నిజామాబాద్ వరకు పుష్‌పుల్ మెము ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి తెస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగం.
- కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ (వయా పెద్దపల్లి–కాజీపేట) మీదుగా మెము ఎక్స్‌ప్రెస్ నడపాలని గతంలో ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోవడం లేదు
- 07195/96 కాజీపేట నుంచి దాదార్ ముంబయి వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుని రోజు నడపాలని ప్రజా ప్రతినిధులు కోరినా స్పందన లేదు

బీజేపీ చేసిందేమీ లేదు



రైల్వేలైన్ శంకుస్థాపన నుంచి రైళ్ల కేటాయింపు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన చొరవ ఎవరూ కాదనలేనిది. ప్రస్తుతం తిరుపతి బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కనీసం రెగ్యులర్‌గా మార్చలేకపోతున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కనీసం ఉప్పల్ బ్రిడ్జి మీద లింక్ కలపడం లేదు.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ, కాంగ్రెస్

పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం



కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్‌కు ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇప్పించాం. ఇందుకోసం రూ.1.54 కోట్లు విడుదల చేయించాం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి సేతుబంధన్ పథకం కింద రూ.126 కోట్లు విడుదల చేయించాం. తిరుపతి రైలును రెగ్యులర్‌గా మార్చే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం.

– బండి సంజయ్, ఎంపీ, బీజేపీ

రైల్వే రంగానికి పెద్దపీట



కరీంనగర్ ప్రజలకు రైల్వే సదుపాయం అందించేందుకు బీఆర్‌ఎస్ కృషి చేస్తోంది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనులే ఇందుకు నిదర్శనం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి అనుమతులు తేవడంలోనూ మా పోరాటం ఉంది. తిరుపతి రైలును రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌పై కేంద్రం దృష్టి సారించాలి.

– వినోద్‌కుమార్, మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు

- క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.250 కోట్ల సాయం
- నిధులను మౌలిక నదుపాయాలకు వినియోగం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు మంజూరయ్యాయి. స్కీం ఆఫ్ స్పెషల్ అసిస్టెన్స్ టూ ద స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ 2023–24 కింద ఈ నిధులు రానున్నాయి. ఈ పథకం కింద రాష్ట్రానికి మొత్తంగా రూ.2102 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు రూ.250.5 కోట్ల సాయం అందనుంది. వీటిని మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా వివిధ శాఖల పరిధిలో ఉన్న భవనాలు, కాలేజీలు, గిడ్డంగులతోపాటు రోడ్లు, రైల్వే నెట్‌వర్క్ నిర్మాణానికి వినియోగించనున్నారు.

ఏ జిల్లాకు ఎలా..?

- కరీంనగర్‌లోని మొదటి సంవత్సరం విద్యార్థులకు వసతి కల్పించేందుకు విత్తన గిడ్డంగిని ఆధునీకరించేందుకు రూ.11 కోట్లు ఇవ్వనున్నారు.
- కరీంనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు రానున్నాయి.
- కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వేలైన్ కోసం మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో వినియోగించుకునేందుకు రూ.100 కోట్లు వెచ్చించనున్నారు.
- ముస్తాబాద్ – రాళ్లపేట వయా పోతుగల్, గన్నేరువరం, సేవాలాల్ తండా, ఓబులాపూర్ రహదారి బలోపేతం, విస్తరణకు రూ.27.50 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- అంబర్‌పేట – చెగ్యాం వయా పైడిపల్లి, తాళ్లకొత్తపేట (వెల్గటూరు మండలం) ఎస్‌హెచ్‌–7 రహదారి విస్తరణకు రూ.12 కోట్లు వ్యయం చేయనున్నారు.

అద్దెకు ఇళ్లు లభించును

- ఊరి నిండా టులెట్ బోర్డులు
- ఇళ్లు, దుకాణాలు ఖాళీ
- డబుల్ బెడ్‌రూమ్‌ల మంజూరుతో ఖాళీ చేసిన పేదలు



ఈ చిత్రంలో సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న ఈ దంపతుల పేర్లు గాజుల మల్లేశం, రాజేశ్వరి. మల్లేశం జాపర్‌గా పనిచేస్తుండగా, రాజేశ్వరి బీడీ కార్మికురాలు. 20 ఏళ్లగా వీరు సిరిసిల్లలో అద్దె ఇళ్లలో ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయడంతో అక్కడికి వెళ్లి ఇలా సత్యనారాయణ వ్రతం చేసుకున్నారు. ఇలా సిరిసిల్లలో దాదాపు వెయ్యి కుటుంబాలు అద్దె ఇళ్లను ఖాళీ చేశాయి.



సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో అద్దె ఇల్లు వెతకడం తలకుమించిన భారం.. ఇది ఒకప్పటి మాట. నేడు పరిస్థితులు మారిపోయాయి. ఏ గల్లీకి పోయిన.. మెయిన్‌రోడ్డులో చూసినా 'టులెట్' బోర్డులే దర్శనమిస్తున్నాయి. కొన్ని ఇళ్ల వద్ద ఐదారు నెలలుగా టులెట్ బోర్డులు వేలాడుతూనే ఉన్నాయి. మధ్యతరగతి ప్రజలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సొంతంగా స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవడం ఒక కారణమైతే.. సిరిసిల్ల లోని పేదలకు మండెపల్లిలో ప్రభుత్వం ఒకేసారి 1200 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయడం మరో కారణం. దీంతో పలువురు అద్దె ఇళ్లను ఖాళీ చేశారు.

ఎక్కడ చూసినా ఖాళీలే..

కామారెడ్డి–కరీంనగర్, సిరిసిల్ల–సిద్దిపేట, వెంకంపేట, మెయిన్ బజారు, డాక్టర్‌స్ట్రీట్, మార్కెట్ ఏరియా, గాంధీచౌక్ ప్రాంతాల్లో షట్టర్ల కిరాయిలు భారీగా ఉండడంతో చిరువ్యాపారులు అద్దె చెల్లించలేక ఖాళీ చేస్తున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంగా మారడంతో ఇళ్ల నిర్మాణాలు పెరిగాయాయి. శ్రీనగర్‌కాలనీ, సాయినగర్, వంశీకృష్ణకాలనీ, విద్యానగర్, సిద్ధార్థనగర్, అయ్యప్ప ఆలయం, జ్యోతినగర్‌లలో ఇళ్ల నిర్మాణాలు భారీగా సాగుతున్నాయి.

లిఫ్ట్ ఉందా..!

గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో రూమ్ దొరికితేనే అద్దెకుండేందుకు వస్తున్నారు. రెండో అంతస్తు, మూడో అంతస్తు అయితే లిఫ్ట్ ఉందా.. అని ఆరా తీస్తున్నారు. లిఫ్ట్ లేకుంటే మెట్లు ఎక్కి దిగడం కష్టమని దూరమైన మరో చోటికి వెళ్తున్నారు. ఇలా సిరిసిల్లలో ఇటీవల ఇళ్లు ఖాళీగా ఉండడంతో 'టులెట్ బోర్డులు' ఎక్కువగా కనిపిస్తున్నాయి.



ఇది సిరిసిల్ల గాంధీచౌక్ సమీపంలోని ఓ దుకాణాల సముదాయం. షట్టర్లకు టులెట్ బోర్డు పెట్టారు. ఇక్కడ మొన్నటి వరకు ఉన్న షాపును వేరే చోటికి తరలించడంతో ఇలా ఖాళీగా ఉంటున్నాయి. ఇలా సిరిసిల్లలోని ప్రధాన మార్గాల్లోని చాలా షట్టర్లు ఖాళీగా కనిపిస్తున్నాయి.

ఆర్నెళ్లుగా ఖాళీ



మా ఇంట్లో డబుల్ బెడ్‌రూమ్ పోర్షన్ ఖాళీగా ఉంది. ఆర్నెళ్లుగా ఎవరూ రావడం లేదు. అంతకుముందు ఓ డాక్టర్ ఉండేవారు. ఆయన ఖాళీ చేయడంతో ఆ ఇంట్లోకి అద్దెకు ఉండేందుకు ఎవరూ రావడం లేదు. ఇప్పటికీ ఖాళీగానే ఉంటుంది.

– చిందం మధు, వ్యాపారి

మూడు పోర్షన్లు ఉన్నాయి



మా ఇంట్లో మూడు పోర్షన్లు ఖాళీగా ఉన్నాయి. గతంతో పోల్చితే సిరిసిల్లలో ఇళ్ల నిర్మాణాలు బాగా పెరిగాయి. జిల్లా అయిన తరువాత చాలా మంది సొంతిళ్లు కట్టుకుంటున్నారు. అద్దెకు ఇచ్చే ఇల్లు టు లెట్ బోర్డులతో కనిపిస్తున్నాయి. మంచి వాళ్లు వస్తేనే ఇద్దామని చూస్తున్నాం.

– డి.రాజేందర్, ఉద్యోగి

క్లుప్తంగా

సబ్బండ వర్గాల అభివృద్ధి లక్ష్యం

● రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు ఆనంద్



బాకూర్‌పల్లిలో మాట్లాడుతున్న ఆనంద్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలోని సబ్బండ వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బాకూర్‌పల్లిలో నూతనంగా నిర్మించిన చర్చిని గురువారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు పెద్ద పీట వేస్తుందన్నారు. మతాలకతీతంగా అన్ని పండుగలకు కానుకలు ఇస్తూ పేదలు ఆనందంగా పండుగ జరుపుకోవడానికి ప్రోత్సహిస్తున్నారన్నారు. మారుమూల గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు చర్చీల నిర్మాణానికి సహకరిస్తామన్నారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నా రు. అనంతరం గుండెపోటుతో మరణించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ మృతికి నివాళి అర్పించారు. సర్పంచ్ అజ్మీరా మంజుల, నాయకులు అందె సుభాష్, రా జునాయక్, బాల్‌రెడ్డి, స్టీవెన్ జ్ఞానకుమార్, పాస్టర్స్ రాజేశ్, ప్రేమ్‌కుమార్, దేవరాజు పాల్గొన్నారు.

ఇంటికి చేరిన గల్ఫ్ మృతదేహం



మైలారం నర్సయ్య(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం వెళ్లిన ఓ వలసజీవి గుండెపోటుతో మృతిచెందగా మూడు రోజులకే మృతుని శవపేటిక ఇంటికి చేరింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మైలారం నర్సయ్య(41) కొన్నేళ్లుగా బెహ్రాన్‌కు వెళ్తున్నాడు. బెహ్రాన్‌లని బల్దియా కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న నర్సయ్య రెండు నెలల క్రితం సెలవుపై వచ్చి వెళ్లాడు. ఈ నెల 26న ఉదయం పనికి వెళ్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన తోటి మిత్రులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ మృతునికి భార్య అనురాధ, కొడుకు అభినాష్, కూతురు శృతి ఉన్నారు.

రైతులకు శాపంగా కేసీఆర్ పాలన

సిరిసిల్లటౌన్: తొమ్మిదేళ్లుగా రైతుల పాలిట శాపంగా కేసీఆర్ పాలన సాగుతోందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలో గురువారం విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా రైతుల ఆత్మహత్యలపై సీఎం నోరు ఎందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. ధరణి పోర్టల్‌తో భూదందాలకు తెరలేపారని ఆరోపించారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ,ధర ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. రైతుల ప్రాణాలను పట్టించుకోని బీఆర్ఎస్ పాలనకు ప్రజలు త్వరలోనే స్వస్తి పలుకుతారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి రైతుల కష్టాలను తీరుస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాలో మరో నగ

● నాడు గీట్ల కృషితో వ్యవసాయ పరిశోధన కేంద్రం
● నేడు దాసరి కృషితో వ్యవసాయ కళాశాల
● ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండోది
● కూనారంలో కళాశాల ఏర్పాటుకు సీఎం అంగీకారం
● నాయకుల్లో ఉత్సాహం.. రైతుల్లో ఆనందం



కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం



వ్యవసాయ కళాశాల కోసం మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ కళాశాల ఉండగా పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారంలో రెండో వ్యవసాయ కళాశాలకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి, కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి మంత్రితోపాటు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. రైతు బిడ్డ, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత గీట్ల ముకుందరెడ్డి చొరవతో కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. నేడు అదే గ్రామంలో వ్యవసాయ కళాశాల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కృషిపై నియోజకవర్గ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైబ్రిడ్ వరి వంగడాలు

కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు తయారు చేసిన హైబ్రిడ్ వరి వంగడాలు కూనారం సన్నాలు కేఎన్ఎం–118, కేఎన్ఎం–1638 అధిక దిగుబడితోపాటు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇవి మన రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత సంతరించుకున్నాయి. వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే ఎందరో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం



కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంత రైతులకు, వారి బిడ్డలకు ప్రయోజనం కలుగుతుంది. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి రైతుల పక్షాన కృతజ్ఞతలు.

– వంగళ తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, కాల్వశ్రీరాంపూర్

ఇక్కడి ప్రజల అదృష్టం



గీట్ల ముకుంద రెడ్డి కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయిస్తే, దాసరి మనోహర్ రెడ్డి వ్యవసాయ కళాశాల మంజూరు చేయించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం. వారికి రుణపడి ఉంటాం.

– నూనేటి సంపత్‌యాదవ్ ఎంపీపీ కాల్వశ్రీరాంపూర్

అన్నదాతలు బాగుండాలి



అన్నదాతలు బాగుంటునే దేశం బాగుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం వారికి కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు అందిస్తోంది. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూస్తోంది. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు నావంతు కృషి చేశా.

– ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి

ఆకట్టుకున్న సంగీత విభావరి



రాజన్న సన్నిధిలో సంగీత విభావరిలో పాల్గొన్న స్థానిక కళాకారులు

వేములవాడ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని రాజన్న ఆలయ అధికారులు గురువారం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కళాకారులు ఎస్.రాధిక బృందం, బి.రేవతి బృందం భక్తిసంగీతం, ధర్మపురికి చెందిన నరహరి శాస్త్రీయసంగీతం, మంటప హనుమాన్ దేవస్థానికి చెందిన స్థానిక కళాకారుల భజన, మధ్యాహ్నం సిరిసిల్ల జన మండలి భజన, స్థానిక మహిళల భజనలు, కరీంనగర్‌కు చెందిన లత బృందం భక్తిసంగీతం, అనిత బృందం భక్తిసంగీతం, సాయంత్రం రక్షిత బృందం భక్తిసంగీతం, రాత్రి సంకీర్తన బృందం భక్తిసంగీతం , రామచంద్రాపురం శిఖామణి హరికథా గానం, అర్ధరాత్రి భారతి హరికథా గానం, మల్లంపల్లి సుబ్రమణ్యశర్మ హరికథా గానం నిర్వహించారు.

మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించిన వ్యక్తిపై కేసు

వేములవాడ: మాజీ నక్సలైట్‌నంటూ బెదిరింపులకు పాల్పడ్డ జంగిడి బాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్ గురువారం తెలిపారు. చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన మారుపాక లక్ష్మికి చెందిన వ్యవసాయ భూమి విషయంలో బెదిరించినట్లు చెప్పారు. ఎవరైన బెదిరింపులకు పాల్పడితే పోలీసులను ఆశ్రయించాలని కోరారు.

పైసల్లేక పోయిన అన్నదాత ప్రాణం

● ఆపరేషన్ చేసినా ఆగిన గుండె
● రెవెన్యూ అధికారుల తప్పిదంతో రైతుబీమాకు దూరం



రమేశ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): మందుగోలీకి పైసలు లేక ఓ నిరుపేద గుండె ఆగిపోయింది. కుటుంబ పెద్ద మరణంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. చందుర్తి మండలంలోని బండపల్లికి చెందిన మంజీర రమేశ్(33) ఏడాదిగా గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి వైద్యుడు పరీక్షలు చేస్తూ ప్రతీ నెల మందులు వాడాలని సూచించారు. ఆరు నెలలుగా అక్కడిక్కడ అప్పులు చేసి నెలకు రూ.5వేలకు పైగా ఖర్చు పెట్టి మందులు కొనుగోలు చేశాడు. నెల రోజులుగా ఎక్కడ అప్పు పుట్టకపోవడంతో ఆస్పత్రికి వెళ్ల లేక పోయాడు. సోమవారం మళ్లీ జబ్బు తిరగబడింది. ఆపరేషన్ చేసిన ఆస్పత్రికి తీసుకెళ్తే అక్కడ రెండు రోజులపాటు వైద్యమందించారు. పరిస్థితి విషమించిందని కరీంనగర్ వైద్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతదేహాన్ని గురువారం ఉదయం బండపల్లికి తీసుకొచ్చారు. గోళీలకు పైసలు లేక ప్రాణాలు పోగొట్టుకుంటివా.. అని బంధువులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అక్కడున్న వారి హృదయాలను కలచివేచింది. మృతునికి భార్య రేణుక, కుమారులు కేపా(7), జోయల్(5) ఉన్నారు. రమేశ్ దహన సంస్కారాలకు చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ అధినేత చల్మెడ లక్ష్మీనర్సింహరావు రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుని కుటుంబాన్ని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ వేములవాడ అర్బన్ అధ్యక్షుడు ఊరడి ప్రవీణ్, కట్ట తిరుపతి, ఊరడి రాజిరెడ్డి పరామర్శించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆ కుటుంబాన్ని వెంటాడుతున్న గుండె జబ్బులు

ఆ నిరుపేద కుటుంబాన్ని ఐదేళ్లుగా గుండె జబ్బులు వెంటాడుతున్నాయి. మంజీర నర్సవ్వ–లస్మయ్య దంపతులకు ఆరుగురు సంతానం. వీరిలో నలుగురు కుమారులు కాగా, ఇద్దరు కుమార్తెలు. నలుగురు కుమారుల్లో ఇప్పటికే ముగ్గురు గుండె జబ్బులతోనే ప్రాణాలు కోల్పోయారు. రెండో కుమారుడు లచ్చయ్య(32) 2017లో, 2021లో మరో కుమారుడు దేవయ్య(30), నాలుగో కొడుకు రమేశ్(33) బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రైతుబీమాకు దూరం

రెవెన్యూ అధికారుల తప్పిదంతో ఆ కుటుంబం రైతుబీమాకు దూరమైంది. 2006లో ఆ కుటుంబానికి వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో భూమి పట్టా వచ్చింది. ధరణి రావడంతో వీరి భూములను ఆన్‌లైన్ చేయలేదు. తమ భూములు ఆన్‌లైన్‌లో రావడం లేదని తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో రమేశ్‌కు భూమి దక్కకుండా పోయింది. ఎకరం భూమి పట్టా ఉంటే రమేశ్‌కు రైతుబీమా దక్కేదంటూ గ్రామస్తులు చర్చించుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

● నగదు రికవరీ
● ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, టేబుల్‌పై రికవరీ చేసిన డబ్బు

సిరిసిల్లక్రైం: జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా జిల్లాలోని భద్రావతికి చెందిన శివుడు, అదే ఏరియాకు చెందిన కళ్యాణ్, సందీప్, సూరి కర్ణాటకతోపాటు వికారాబాద్, సిరిసిల్లలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కళ్లెం శ్రీనివాస్ బోర్‌వెల్ దుకాణం నడిపేవాడు. జూన్ 3న తన గ్రామం నుంచి కారులో వేములవాడకు వచ్చి బొమ్మల స్వామి నుంచి తీసుకున్న రూ.5లక్షల చెక్కును బ్యాంకులో వేసి డబ్బులు తీసుకున్నారు. ఆ నగదును కారు వెనుక సీటులో పెట్టుకొని వేములవాడలోని ఆర్అండ్ఆర్ కాలనీలో తన సోదరి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులకొట్టి ఆ సొమ్మును ఎత్తుకెళ్లారు. దీనిపై వేములవాడ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో వేములవాడ సీఐ వెంకటేశ్, సీసీఎస్ ఎస్సై మారుతి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు దొంగతనాలకు పాల్పడిన వారు కర్ణాటకకు చెందిన వారిగా తెలుసుకుని అక్కడికెళ్లి శివను అదుపులోకి తీసుకుని రూ.5 లక్షలు రికవరీ చేశారు. వేములవాడలో దొంగతనాలు చేసిన రూ.2.60 లక్షలు, అలాగే వేములవాడలో మే నెలలో దొంగతనం చేసిన రూ.40 వేలను రికవరీ చేశారు. బల్లారి, రాయచోరీలతోపాటు హుజూర్‌నగర్, సూర్యపేట, తాండూర్, వికారాబాద్‌లలో పలు దొంగతనాలు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, సీసీఎస్ కానిస్టేబుల్ అక్బర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
● పేదల సంక్షేమం బీఎస్పీతోనే సాధ్యం
● వంతడుపులలో బహుజన రాజ్యాధికార సభ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఇల్లంతకుంట(మానకొండూర్): రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామంలో గురువారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు హామీలను సీఎం తుంగలో తొక్కారన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఐదేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బీసీలకు రూ.లక్ష రుణసాయాన్ని ప్రకటించారన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిషాని రామచంద్రం, శ్రీనివాస్, విశ్వం, సృజన, రవి, భూమయ్య, భాను, లింగయ్య పాల్గొన్నారు.

పల్లెలకు పచ్చని తోరణాలు

● జిల్లాలో 52 రహదారులు, రెండు లక్షల 25వేల చెట్లు
● 93,299 మొక్కలకు ట్రీగార్డులు
● చనిపోయిన 17,043వేల మొక్కల స్థానంలో కొత్తవి
● జీపీలదే సంరక్షణ బాధ్యత
● తొలగించే వారిపై క్రిమినల్ కేసులు
● ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు



రహదారుల వెంట ఆహ్లాదాన్ని పంచుతున్న వృక్షాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న పచ్చని చెట్లు నారాయణపూర్ ప్రధాన రహదారిపై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నిత్యం ఈ దారిగుండా ప్రయాణించే వారు కాసేపు సేద తీరి వెళ్తున్నారు. ఒకప్పుడు ఈ మార్గంలో ఒక్క చెట్టు కూడా కనిపించేది కాదు. అలాంటిది ఐదేళ్లలో దారి పొడవునా పెద్ద చెట్లు పచ్చని స్వాగతం పలుకుతున్నాయి. నారాయణపూర్ లాగానే జిల్లాలోని 52 రహదారుల్లో పచ్చని తోరణాలు కనువిందు చేస్తున్నాయి.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని ప్రధాన రహదారులు పచ్చనితోరణాలుగా మారాయి. హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగాయి. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 52 రహదారులు ఉన్నాయి. వీటి వెంట ఇప్పటి వరకు 2.25 లక్షల మొక్కలు నాటగా, ప్రస్తుతం 1,00,569 మొక్కలు పది ఫీట్ల కు పైగా ఎత్తుకు పెరిగాయి. అంతకు తక్కువ ఎత్తులో ఉన్న 93,299 మొక్కలకు రక్షణగా అధికారులు ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. ఇందులో 17,043 మొక్కలు చనిపోగా వాటి స్థానంలో కొత్త మొక్కలు పెంచుతున్నారు. మొత్తంగా రహదారుల వెంట ఉన్న మొక్కలను మహా వృక్షాలుగా తయారు చేయాలనే సంకల్పంతో అధికా రులు ముందుకుపోతున్నారు.


కంటికి రెప్పలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలను అధికారులు, నిర్వాహకులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. నర్సరీలలో విత్తినప్పటి నుంచి ప్రధాన రహదారుల వెంట పెట్టిన మొక్కలను వృక్షాలుగా తయారు చేయడంలో ఎంతో కృషి ఉంది. పంచాయతీ సిబ్బంది నిత్యం ఉదయం, సాయంత్రం నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టగా, ఉపాధిహామీ సిబ్బంది మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగిస్తూ రక్షణగా నిలిచారు. రాత్రి పూట ప్రధాన రహదారుల వెంట మధ్యలో ఉన్న డివైడర్లపై పెట్టిన మొక్కలతో లైట్ వెలుగులు కళ్లకు కొట్టకుండా ప్రమాదాల నివారణకు దోహదపడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన రహదారుల వెంట నేడు వృక్షాలు చల్లదనంతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

జిల్లా రహదారులకు అనుసంధానంగా..

జిల్లా కేంద్రానికి 13 మండలాల నుంచి ప్రధాన రహదారులతోపాటు 52 రహదారుల వెంట మొక్కలు పెంచుతున్నారు. సిరిసిల్లకు అనుసంధానంగా ఉన్న రోడ్లను ఎంచుకొని మొక్కలు పెంచడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది రహదారుల వెంట నిత్యం క్షేత్రస్థాయిలో మొక్కలను పరిశీలించడమే కాకుండా ట్రీగార్డులు లేని వారికి కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండేళ్లలో రాజధానికి వెళ్లే జాతీయ రహదారులకు దీటుగా జిల్లా రహదారుల్లో నాటిన మొక్కలను పెంచడానికి అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.


ఆహ్లాదాన్ని పంచుతున్నాయి



ప్రధాన రహదారుల వెంట నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా తయారై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రాత్రి పూట ప్రధాన రహదారుల వెంట మధ్యలో ఉన్న డివైడర్లపై పెట్టిన మొక్కలతో లైట్ వెలుగులు కళ్లకు కొట్టకుండా ప్రమాదాల నివారణకు కూడా చెట్లు దోహదపడుతున్నాయి. ఐదేళ్లలో రోడ్ల వెంట నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి.

– న్యాలకంటి దేవేందర్, ఎల్లారెడ్డిపేట


పచ్చదనంతో పల్లెలు



ఐదేళ్ల క్రితం రోడ్డు కిరువైపులా ఎలాంటి మొక్కలు, చెట్లు లేక బోసిపోయి ఉండేవి. మండుటెండల్లో రోడ్ల వెంట సేదతీరే అవకాశం ఉండేది కాదు. ఐదేళ్ల తక్కువకాలంలోనే పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు గ్రామాల రహదారులు పచ్చదనంతో కనిపిస్తూ ఆహ్లాదం పంచుతున్నాయి.

– మోతె మధుసూదన్‌రెడ్డి, నారాయణపూర్

నిత్యం పరిశీలన





సిరిసిల్ల జిల్లా కేంద్రానికి అనుసంధానంగా ఉన్న రోడ్లను గుర్తించి మొక్కలు నాటాం. హరితహారంలో ఏడు దఫాలుగా నాటిన మొక్కలు ఐదేళ్లలో వృక్షాలుగా మారాయి. నాటిన మొక్కలను ఈ వ్యవధిలో నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అందరం సమన్వయ ంతో పనిచేయడంతో వాటిని వృక్షాలుగా తయారు చేయగలిగాం.– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

కార్యదర్శులకు డీఎస్ఆర్ కష్టాలు

● సమయానికి వెళ్లినా సర్వర్ డౌన్
● ఫొటోలు అప్‌లోడ్ చేసేందుకు ఇక్కట్లు
● రాష్ట్రంలో జిల్లా చివరి స్థానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామపంచాయతీ కార్యదర్శులకు డెయిలీ శానిటేషన్ రిపోర్ట్ (డీఎస్ఆర్) కష్టాలు ప్రతి రోజు వేధిస్తోంది. సమయానికి గ్రామాలకు వెళ్లినప్పటికీ డెయిలీ శానిటేషన్ రిపోర్ట్ అప్‌లోడ్ చేస్తే మాత్రం సర్వర్ మొరాయిస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. గంటల తరబడి డీఎస్ఆర్ కోసమే పడిగాపులు కాయాల్సి వస్తోందని.. దీంతో గ్రామంలో చేయాల్సిన మిగతా పనులకు ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే తేలికగా తీసిపారేస్తున్నారని, అదే సమయంలో డీఎస్ఆర్ ఎందుకు చేయడం లేదంటూ ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. కాగా తెలంగాణ రాష్ట్రం మొత్తంలో రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎస్ఆర్ అప్‌లోడ్‌లో చివరి స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన టెక్నికల్ సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులు పరిష్కరించాల్సి ఉంది. లేనిపక్షంలో పంచాయతీ కార్యదర్శులు ఎంత పనిచేసినా రాష్ట్రస్థాయిలో జిల్లాకు రా వాల్సిన గుర్తింపు రాకుండా పోయే అవకాశం ఉంది.





ఆషాఢం ఆటవిడుపు

వేములవాడ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వేములవాడకు చెందిన బ్రాహ్మణ మహిళలు స్థానిక భీమన్నగుడిలో గురువారం సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితోపాటు స్థానికులు తొలి ఏకాదశిని పురస్కరించుకొని వేములవాడకు ఈనెల 28నే చేరుకున్నారు. గురువారం ఉదయం భీమన్నగుడికి చేరుకుని ఆటపాటలతో సరదాగా గడిపారు.